Postal Regd. No. VSP-142/07-09

**✶ యేసుక్రీస్తు అందరికి ప్రభువు**

CHRISTAVANAADU
Telugu Fortnightly

Head Office : 17-108, Sanjay Gandhi Colony, Hanumanthavaka Junction, opp.L.V.Prasad Eye institute, Visakhapatnam - 40

RNI APTEL /2006/17980
e-mail: christavanaadu1@yahoo.co.in

# క్రైస్తవనాడు

**ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక**

విశాఖపట్నం | సంపుటి : 2 | సంచిక : 2 | ఎడిటర్ : వై. కనకరాజు | 2007 సెప్టెంబర్ 1-15 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

✶రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము.

✶ఈమాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు.




క్రైస్తవ హృదయసింహాసనాసీనుడు ప్రభువైన యేసుక్రీస్తే అనుట అతిశయోక్తి కాదుసుమా!

యేసుక్రీస్తు బోధలు ఆనాటి నుండి ఏనాటి వరకైనా సజీవంగా నిలిచివుంటాయని బైబిలు చెప్పిన సాక్ష్యం ఎంతైనా నమ్మదగినది. ఎందుకంటే విశ్వాన్ని గూర్చి,మానవ జీవన సంబంధ అంశాలను గూర్చి సంపూర్ణంగా ప్రకటించిన బైబిలు మాటలు నేడు లోకాన నిరూపించ బడుతున్నాయి. మహామహుడగు దేవుని గూర్చి బైబిలు ఎంతో ఉన్నతంగా తెలియజేస్తుండగా... లోకస్తులనేకులు తమకు తోచిన విధంగా దేవుని ఆరాధించుట ఒకింత బాధాకరం. లోకస్తులను అనుటెందుకు? బైబిలు కలిగిన, చదివిన క్రైస్తవులే దేవుని ఒక పావురం రూపాన ఆరాధించుట వెర్రితనం. వీరు అమాయకులందామా అంటే మేము క్రైస్తవ లోకంలో ఘనులం అంటారు. విశ్వాన్ని అందున్నవియు ఒక క్రమపద్ధతిలో త్రిప్పుచు మనల్ని భూమిపై అద్భుతంగా పోషిస్తున్న దేవునికి వీరిచ్చిన స్వరూపం రూపం పావురం. ఇది ఖచ్చితంగా దేవాది దేవుని కించపరుచుటే సుమా! దేవుడ పావురమని బైబిలు నందెక్కడను కానరాదు. లేఖనాలను సరిగా

2లో...

## మినిస్ట్రీలు చేస్తున్నదేమిటి? చేయవలసినదేమిటి?

## కులమా...? క్రైస్తవ్యమా...?

7లో...

## సంఘాలలో... బోధకుల- విశ్వాసుల పాత్ర చాకిరేవు

5లో...



## టాప్-5 ఉక్కు ఉత్పాదక దేశంగా ఇండియా

2లో...

## పంచాయితీల విభజనతో మరిన్ని ఉద్యోగాలు

6లో...

# వందకోట్లతో యువతకు ఉపాధి

## ముఖ్యమంత్రి వై.ఎస్. హామీ

క్రైస్తవనాడు ప్రతినిధి, హైదరాబాద్: ఈ ఏడాది పదిలక్షల మంది యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించామని, యువశక్తి మనరాష్ట్ర సంపదని, ప్రతి యువకుడికి ఉపాధి కల్పించే ప్రయత్నంలో ఉన్నామని ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అన్నారు. గ్రామీణ ఉపాధిశాఖ సారథ్యంతో ఎంప్లాయిమెంట్ జనరేషన్, మార్కెటింగ్ మిషన్ సదస్సులో ఆయన మాట్లాడు తూ, రాష్ట్ర ప్రభుత్వశాఖలలో అన్నింటి లోను యీ విషయమై కసరత్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.


గ్రామాలలో కాళ్లు చాపుకొని చెట్లక్రింద పడుకునే యువకులు ఉండటానికి వీలులేని పరిస్థితి కల్పిస్తామని 'ఇందిరా క్రాంతి' పథకం ద్వారా యీ సంవత్సరం లక్షాయాభై వేల మందికి ఉద్యోగాలు యిస్తామని ముఖ్య మంత్రి చెప్పారు. ఉపాధి అవకాశాలు పొంది ఉల్లాసంగా ఉత్సాహంగా ఉన్న యువతీ యువకులతో ఆయన మాట్లా డారు. ఆర్థిక వృద్ధిరేటు స్థూల ఉత్పత్తికి చేరుకోవడంపట్ల గర్విస్తున్నామని, గ్రామీణ ప్రాంతాలలో యీ వృద్ధిరేటు ఎటువంటి మార్పులను తీసుకు వచ్చిందో పరిశీలించాలని ఆయన అధికారులకు సూచిం చారు. ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి పనులు ప్రారంభంకాగానే రూ॥60 కోట్లు విడుదల చేస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వమే ఉపకార వేతనాలు కల్పించి తక్కువగా చదువుకునే యువతీ యువకులకు శిక్షణ యివ్వనుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఐటిఐల లో పాత విధానాలకు స్వస్తి పలికి ఏ రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయో వాటిలో శిక్షణ యిప్పిస్తామని ప్రయివేటు ఐటిఐలు కూడా యీ పద్ధతిని అనుసరించాలని ఆయన కోరారు.



డిఆర్‌డిఎ, యువజన ఉపాధి కల్పన శాఖ జవహర్ నాలెడ్జిసెంటర్, ఐటి రంగాలలో ఉపాధి అవకాశాలు పెరుగు తున్నాయని వైఎస్ చెప్పా రు. ఎనిమిది మాసాలక్రింద ఏర్పడిన ఒక పరిశ్రమలో 30వేలమందికి ఉద్యోగాలు వస్తాయని రాజశేఖరరెడ్డి అన్నారు.

యువతను పరిశ్రమలకు అణుగుణంగా తీర్చిదిద్దుతామని స్త్రీ పురుషులకు సమాన అవకాశాలు వచ్చే విధంగా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సదస్సులో ప్రసంగించిన గ్రామీణాభివృద్ధిశాఖమంత్రి జి.చిన్నారెడ్డి రూ॥120కోట్లలో ఇందిరా గ్రామీణ పథకంద్వారా ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు. ఈ సదస్సులో ఉపాధికల్పన తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కొత్త గవర్నర్‌గా ఎన్.డి. తివారి



క్రైస్తవనాడు ప్రతినిధి, హైదరాబాద్: తండ్రితో పాటు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన ఎన్.డి. తివారి రాష్ట్ర కొత్త గవర్నర్‌గా నియమితులయ్యారు. 65 ఏళ్ల పాటు రాటుదేలిన రాజకీయ దురంధ రునిగా రాణించి, యావద్భారత దేశంలో విభిన్న పదవులు నిర్వహించి పరిపాలనా దక్షునిగా పరిణతి చెందిన నారాయణ దేవ్ తివారి నాలుగుసార్లు దేశంలో అతిపెద్దదైన ఉత్తరప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా చేశారు. ఎంతో కాలం ఎన్ని ఉన్నత పదవులలో వున్నా ఒక్క అవినీతి ఆరోపణ లేని తివారి మనరాష్ట్ర గవర్నర్‌గా రావడం ఎంతో విశేషమైనది.

ఉత్తరప్రదేశ్‌లోని నైనిటాల్ జిల్లాలో ఒక గ్రామంలో అక్టోబర్18, 1925న తివారి జన్మించారు. అలహాబాద్ యూనివర్సిటీ నుండి ఆయన ఎం.ఎ., బి.ఎల్., పట్టాలు పొందారు. 82 ఏళ్ల తివారి మంచి క్రీడాకారుడు. 'ప్రభాత్' అనే హిందీ మాసపత్రికకు సంపాదకుడు. సామాజిక సేవా కార్యకర్తగా ఎన్నో విద్యాసంస్థల ప్రారంభానికి కారకునిగా ఆయనకు మంచి పేరు ప్రతిష్టలు వున్నాయి.

**✶ సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరం**

*(మొదటి పేజీ తరువాయి...)*

చదువక గ్రహించక మిడిమిడి జ్ఞానంతో అలరారు వీరు దుర్బోధకులు. సర్వోన్నతుడైన దేవుని పావురం రూపాన కొల్చుటకు వీరికెంత ధైర్యం? పావురమే దేవుడని కొలుచు ప్రతి క్రైస్తవులు నిత్యుడగు దేవుని అనిత్యమైన వాటి స్వరూపంగా భావించినట్లే. ఇది దేవునికి ప్రత్యక్షంగా చేస్తున్న ద్రోహమే. దీని గూర్చి బైబిలునందు దేవుడు వ్రాయించిన మాట మనమొకసారి గుర్తుచేసుకోవాలి.

**✶వారు దేవునినెరిగియు దేవుని దేవునిగా మహిమపరచలేదు**

పై లేఖనం అన్యుల కొరకే అనుకుంటే దేవుని దేవునిగా మహిమ పరచని ప్రతి క్రైస్తవులు అన్యులే సుమా! ప్రభువైన యేసుక్రీస్తు మన హృదయ సింహాసనాసీనుడు. వాక్య రూపాన సదాకాలము మనకు తోడై నడిపిస్తున్న మహారాజు. ఆత్మరూపాన వాక్యాన్ని మనకు గ్రహింపజేస్తున్న పరిశుద్ధాత్మ స్వరూపులు. ఆయనే క్రైస్తవులు అనే తన దేవుని పిల్లల ఆత్మీయం, పరసంబంధ రాజ్య సింహాసనాసీనుడు. మన ద్వారా వాక్యం విన్న వారి మనసులను మార్చి ఏలుచున్న ఆత్మీయ సింహాసనాసీనుడు, పరమ తండ్రియైన దేవాదిదేవుని ప్రియ కుమారుడు. దైవసింహాసనానికి వారసులు. తన అధికారాన్ని లోకానికి శకపురుషునిగా చూపుతున్న సింహాసనాసీనుడు. ఎవరెందరున్నను శకపురుషుడు ఒక్కడే! ఆయనే మన ప్రభువైన యేసుక్రీస్తు. ఆయన అవతరించిన నాటి నుండి నేటివరకు తన దైవవాక్కులతో లోకాన్ని పాలిస్తున్నట్లు గ్రహించవచ్చు. శరీరధారిగా జీవించునపుడు ఆయన చూపిన ప్రేమ, దయ, క్షమాగుణాలే క్రైస్తవ జీవితాలకు ఆదర్శాలు. తన ప్రతి అడుగులో పరిశుద్ధత కనబరచిన వారే ప్రభువైన యేసుక్రీస్తు. మానవ రూపంతో దైవత్వాన్ని సంపూర్ణంగా చూపి జీవించిన ఘనచరిత్ర కలవారే యేసుక్రీస్తు. చరిత్రకు ఆధార పురుషుడై తన క్రీస్తుశకంతో లోకాన్ని పరిపాలిస్తున్న సింహాసనాసీనుడే మన ప్రభువైన యేసుక్రీస్తు. ఎవరి సింహాసనమైనా లోకంలో స్థానభ్రంశం చెందవచ్చు గానీ, మన ప్రభువైన యేసుక్రీస్తుని సింహాసనం పరమందును (దైవ కుమారునిగా పరలోకాధికారం) ఇహమందును (శకపురుషునిగా అనంతాధికారం) నిలిచివుంటుందని తెలుసుకుంటున్న మనమెంత ధన్యులం. దీన్ని గూర్చి నిత్య నిరూపణ మాటలు గల బైబిలేమంటుందో చూద్దాం.




**✶యేసు వారి యొద్దకు వచ్చి – పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది**

బైబిలునందు ప్రభువు మాటగా వ్రాయబడిన పై లేఖనం నిత్య జీవపు మాటగా మనకు కన్పించుట ఎంతో ఆనందకరం. పై లేఖనాన్ని బట్టి నేడు మనం ఆయన అధికారాన్ని భూమిపై శకపురుషునిగా చూస్తున్నాం. నిరూపణకు నిలబడేవిధంగా లేఖనం స్పష్టంగా గోచరిస్తుంది. ప్రభువుకు పరలోకంపై గల అధికారాన్ని ఎప్పుడు చూస్తాం? భూమిపై మన జీవనయాత్ర ముగిసిన వెంటనే. కాబట్టి లేఖనాల ప్రకారం... ప్రభువైన యేసుక్రీస్తుని తమ హృదయ సింహాసనాసీనుడిగా భావించుట క్రైస్తవులకెంతో ఆదరణనిస్తుందనేది నిర్వివాదాంశాం. అందునుబట్టి అనేకులకు ఆయనను ప్రకటించుట లేఖన నెరవేర్పని అందరు గ్రహించుకోవాలి... ప్రకటించుటలో ఆనందిద్దాం.

# టాప్-5 ఉక్కు ఉత్పాదక దేశంగా ఇండియా



న్యూఢిల్లీ, క్రైస్తవనాడు ప్రతినిధి : ఉక్కు ఉత్పత్తి పెరగడం, ప్రధాన ఉక్కు కంపెనీలు విస్తరణ పథకాలు చేపట్టడంలో ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలో ఐదవ పెద్ద దేశంగా ఇండియా అవతరించించి. 2006 క్యాలండర్ సంవత్సరపు గణాం కాల ప్రకారం ఇండియాలో 49.45 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తిచేసి, టాప్-5 జాబితాలోకి చేరింది. అంతక్రితం ఏడాది ఇండియా ఏడవ ర్యాంకులో వుందని ఇటీవల విడుదలైన అధికారిక ప్రకటన తెలిపింది. 2006-07 సంవత్సరంలో ఫినిష్డ్, అల్లాయ్ స్టీల్ నికర ఉత్పత్తి 51.90 మిలియన్ టన్ను లని జాయింట్ ప్లాంట్ కమిటీ (జెపిసి) సవరించిన గణాంకాలు తెలుపుతున్నాయి.


2005-06లో ఇది 46.56 మిలియన్ టన్నులు ముగిసిన ఆర్థిక సంవత్సరం దేశంలో ఉక్కు వినియోగం అంతక్రితం ఏడాదితో పోలిస్తే 41.13 మిలియన్ టన్నుల నుంచి 46.14 మిలియన్ టన్నులు పెరిగింది.

# చిన్న, మధ్యతరహా దినపత్రికల పాత్రపై అఖిలభారత సదస్సు

*క్రైస్తవనాడు ప్రతినిధి, హైదరాబాద్: దేశంలో ఉన్న చిన్న, మధ్యతరహా దిన పత్రికలు ప్రజా స్వామ్యచరిత్రలో నిర్వహించగలిగిన పాత్ర గురించి, వందల కోట్ల రూపాయల పెట్టుబడితో పెద్ద పత్రికలు వస్తున్న నేపథ్యంలో చిన్న పత్రికల ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించడానికి వీలుగా అక్టోబరు 6,7 తేదీలలో అఖిలభారత స్థాయి వర్క్‌షాపును హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు కృష్ణాపత్రిక ఎడిటర్ మరియు వర్క్‌షాపు చీఫ్ కన్వీనర్ పిరాట్ల వెంకటేశ్వర్లు తెలియజేశారు.*

*విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిరాట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరు సెషన్లుగా జరిగే ఈ రెండు రోజుల వర్క్‌షాపులో మొదటి సెషన్‌లో దేశాభి వృద్ధిలో నదుల నీటి వనరుల వినియోగం అనే అంశంపై రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి పొన్నాల లక్ష్మయ్య, చెన్నైకి చెందిన సరస్వతి, శింధు రీసెర్చ్ సెంటర్ అధ్యక్షులు డా.ఎస్. కళ్యాణరామన్ ప్రసంగి స్తారని, రెండవ సెషన్‌లో పోలీసులకు – పత్రికలకు ఉండవలసిన సంబంధాలు, దేశంలో శాంతిభద్రతల పరిస్థితి తదితర అంశాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీవాత్సవ, రాష్ట్ర హోంశాఖా మంత్రి కె. జానారెడ్డి, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి. పురుషోత్తమరావు ఢిల్లీలోని ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ జవహర్‌లాల్ కౌర్ తదితరులు ప్రసంగిస్తారన్నారు.*

*మూడవ సెషన్‌లో దేశంలో చిన్న, మధ్యతరహా దినపత్రికల విషయమై భారత ప్రభుత్వ వైఖరి అనే అంశంపై భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ శ్రీమతి దీపక్ సింధు ప్రసంగి స్తారని, నాలుగవ సెషన్‌లో సమాచార హక్కు చట్టంపై జరిగే సదస్సులో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, కె.వి. రమణాచారి, రాష్ట్ర ప్రిన్సిపల్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ ఆరా, బొంబాయి ఫ్రీలాన్స్ జర్నలిస్టు గణేష్ సోవాని, సమాచార శాఖ కమిషనర్ సి. పార్థసారధి, ఢిల్లీకి చెందిన ప్రముఖ దినపత్రిక సంపాదకులు రాంబహదూర్, తదితరులు ప్రసంగించ నున్నారని అదే విధంగా అయిదవ సెషన్‌లో దేశాభి వృద్ధిలో మానవ వనరుల వినియోగం అనే అంశంపై మానవ వనరుల వినియోగం గురించి కేంద్ర మంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధరేశ్వరి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో చిన్న మధ్య, తరహా దినపత్రికల పాత్ర అనే అంశంపై రాష్ట్ర మంత్రి ఎం.బుద్ధ ప్రసాద్, లక్నో ఫ్రీలాన్స్ జర్నలిస్టు భూపేంద్ర నాద్ జైన్ తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారని, ఈ సందర్భంగా జరుగు చర్చలో పత్రికా ప్రతినిధులు అందరూ పాల్గొన వచ్చని పిరాట్ల అన్నారు. ఈ వర్క్‌షాపు ప్రారంభోత్సవ సభలో కేంద్ర, సమాచార, ప్రసారాల మంత్రి ప్రియ రంజన్ దాస్ మున్షి, రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి, రాష్ట్ర సమా చార శాఖా మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డి, తిరుమల దేవస్థానం ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పాల్గొంటారు.*




# క్రైస్తవనాడు లో ప్రకటన ధరలు

| బ్లాక్ & వైట్‌లో | పూర్తి పేజీ | అరపేజీ | పావు పేజీ |
|---|---|---|---|
| ముందర పేజీ | ***** | 3,500/- | 2,000/- |
| మధ్య పేజీల్లో | 5,000/- | 2,800/- | 1600/- |
| చివరి పేజీ | 8,000/- | 4,500/- | 2,500/- |

| కలర్‌లో | పూర్తి పేజీ | అరపేజీ | పావు పేజీ |
|---|---|---|---|
| ముందర పేజీ | ***** | 8,000/- | 4,500/- |
| మధ్య పేజీల్లో | 8,000/- | 4,500/- | 2,500/- |
| చివరి పేజీ | 16,000/- | 8,500/- | 5,000/- |

వివరాలకు: సెల్ నెం.9346960601, 9849134647, 9393121588, 9866113513

**మీ ప్రకటనలు ఆంధ్రా అంతటా అనేక ప్రాంతాల్లో తెలుస్తాయని గమనించండి. 6 నెలలు లేక సంవత్సర కాంట్రాక్టుకు "ప్రత్యేక రిబేటుకై" ఎడిటర్‌ను సంప్రదించండి.**

**క్రైస్తవనాడు పాత పేపర్లు మిస్సయిన వారికి అపూర్వ అవకాశం !**

మొదటిసంచిక 2006 ఆగస్టు 20 నుండి వచ్చిన మొదటి సంవత్సర 24 క్రైస్తవనాడు పేపర్లు A-4 సైజ్ జెరాక్స్ కాపీలు అందమైన 'స్పైరల్ బైండింగు'తో లభించును. కావలసినవారు సంప్రదించండి. పోస్టేజీతో కలిపి రూ.400/- మాత్రమే. ఎం.ఓ. చేసి పొందండి.

క్రైస్తవనాడు ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

**కమిషన్‌పై మార్కెటింగ్ చేయుటకు ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించండి.**

సెల్ : 9346960601, 9849134647

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



సంపుటి :2 సంచిక : 2 సెప్టెంబర్ 1-15, 2007

☆ ☆ ☆

## మంచి పునాది వేద్దాం!

**✶ బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు వృద్ధుడైనపుడును దాని నుండి తొలగిపోడు**

నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న మారణకాండకు ప్రత్యక్ష సాక్షులముగా మనం నిలిచిపోతున్నామే తప్ప ఆపలేకపోతున్నాం. మారణకాండ సృష్టించువారు ఏదైనా ఒక గ్రహం మీద నుంచి వస్తున్నారా అంటే లేదే! వారు మన తోటివారే! మరెందుకు వారలా చేస్తున్నారంటే కారణం...? వారికి బాల్యం నుండి వేయబడని ఆధ్యాత్మిక పునాదని ఆధ్యాత్మికవాదులు చెప్తుంటారు. బాల్యం నుండి వారికి తెలిసో తెలియకో నేర్పిస్తున్నదేమిటి? వానితోటివాని కంటే గొప్పగా చదువు, సంపాదించు, జీవించు అని. బాల్యం నుండే వారికి బ్రతుకు యొక్క ఆరాటంలో పరోక్షంగా ఎదుటివానిని నీవు ఓడించు అని చెప్పకనే చెబుతుంటారు. ఇక్కడే మనమొకటి ఆలోచించాలి. గెలవాలనే తపనతోనే ఎదిగిన బాలలు యవ్వనస్థులైన తరువాత అదే ఒరవడిని పాటిస్తారు. అలా గెలవని పక్షంలో మానసికంగా కృంగిపోతుంటారు. కొందరైతే ఆత్మహత్యలకు పాల్పడుట మనం తరచుగా మీడియాలో చూస్తున్నాం. మరికొందరు ఆ సమయానికి చేరదీసి ఆదరించువారికి బానిసలుగా మారి వారు చెప్పింది చేస్తుంటారు. మంచి చెడుల విచక్షణా జ్ఞానం కోల్పోతుంటారు. అలాంటివారిని మనం పిలిచే పేరు టెర్రరిస్టు. వారు తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటుంటారు తల్లిదండ్రులకు తలవంపులు తెస్తుంటారు. తమ పిల్లలు బ్రతికి వున్నారో, చనిపోయారో, ఎన్‌కౌంటర్ అయ్యారో తెలియని స్థితి తల్లితండ్రులది. ఎంత బాధాకరం వారి తల్లిదండ్రుల జీవితాలు! యవ్వనంలో ఒక అనాలోచిత నిర్ణయం తమ జీవితాలను సంపూర్ణంగా బలి తీసుకుంటుందని ఎరుగని తనం. ఎవరు చెప్తారు? ఎవరు ఆదరిస్తారు వాళ్లను. పిల్లలలా తయారగుటకు కారణం ఎవరు? ఒకసారి బేరీజు వేసుకుని చూస్తే... తల్లిదండ్రులదేయని గ్రహించవచ్చు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు. ఏమిచేస్తున్నారు? ఆలోచించవద్దా? తప్పక ఆలోచించాలి. మొదట్లోనే తేడాను గమనించి సరిచేయాలి. మంచి భవిష్యత్తుకు పునాదివేయాలి. వారిని మన ఇష్టాలకు బలిచేయరాదు. వారి ఇష్టాలను ఎరిగి మంచి వైపు ప్రోత్సహించాలి. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు అని బాల్యం నుండే నేర్పుతూ ఆచరించునట్లు చూస్తూ మంచి పునాదివేయాలి. అపుడే వారు పెద్దవారైన తరువాత కూడా ఆ మార్గం నుండి తప్పుకోరు. అలాగున పెరిగినవారిని ఎవరూ చెడువైపు మళ్ళించలేరు. అటువంటి మంచి పునాది వేయబడిన పిల్లలదే భవిష్యత్తు. భావితరాలకు తమ బ్రతుకులే పాఠ్యాంశాలుగా బోధింపబడునట్లు జీవిస్తారు. తమ జ్ఞాపకాలను భూమిపై శాశ్వతంగా ఉండేవిధంగా ఘన కార్యాలు చేస్తారు.

**"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తమును.........మా కొరకు ప్రార్థించుడి" (2 థెస్స 3:1)**

వై.కె.

**క్రైస్తవనాడులో ప్రచురించు బైబిలుకు సంబంధించిన ప్రతి వివరణ అనంతమైన దేవుని జ్ఞానంలో కొంతమాత్రమే. మరెక్కువ తెలుసుకొనుటకు మీ సందేహాలను వ్రాయండి. మీ, మా క్రైస్తవనాడులో వివరణాత్మకంగా ప్రచురించుటకు అవకాశం ఇచ్చినవారిలో మీరు ఒకరై ఉండాలనే మా ఆకాంక్ష.**

మీ అడ్వర్టైజ్‌మెంట్లు మొదలగువాటి విషయమై ఎడిటర్‌ను సంప్రదించగలరు.
**ఎడిటర్ : వై.కె. రాజు, సెల్ : 9346960601, 9849134647**

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం

**"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటి వరకూ సైన్సు సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలియజెప్పటకు చేయు ప్రయత్నమే ఈ "దేవునిజ్ఞానం - మానవ విజ్ఞానం" శీర్షిక ముఖ్యోద్ధేశము.**

14

## భూమిని గూర్చి శాస్త్రవేత్తలు..... / భూమిని గూర్చి దేవుని గ్రంథంలో.....

### బైబిల్ × సైన్స్

(గత సంచిక తరువాయి...)

భూమిని గూర్చి తన గ్రంథంలో దేవుడేమంటున్నాడో తెలుసుకుందాం.

భూమిలోనుండి ఆహారము పడుతుందని చెప్పినదేవుడు ఎలా పుడ్తుంది? ఎందుకు పడుతుంది అని చెప్పిన లేఖనాలు మనకెంతో విజ్ఞానాన్ని ఆదరణను కలిగిస్తాయనుటలో మనకెటువంటి సందేహము ఉండరాదు. భూమిని గూర్చి దైవలేఖనాలను వరుసగా చూద్దామా... రండి మరెందుకాలస్యం. మన ందరి ఆధ్యాత్మిక మేలుకోసం దైవజ్ఞానం తరచి చదివి ధన్యులమవుదాం. ముందుగా దేవుని వాక్కుకున్న శక్తిని గూర్చి...

**✶దేవుడు-గడ్డిని విత్తనములిచ్చు చెట్లను భూమిమీద తమ తమ జాతిప్రకారము తమలో విత్తనములుగల ఫలమిచ్చు ఫల వృక్షములను భూమి మొలిపించుగాకని పలుకగా ఆప్రకారమాయెను.**

విశ్వారంభంలో .. భవిష్యత్తులో పుట్టబోవు దేవుని పిల్లలమైన మనకోసం భూమి వేటిని పండించాలో వాటికై భూమికి ఆజ్ఞ దేవుడిచ్చునట్లున్న లేఖనం చెప్తుంది. ఆనాటి నుండి భూమి తన విధులను నెరవేరుస్తున్నట్లు మనం చూస్తున్నాం. కొన్నిచోట్ల పండదు. దాని కి కారణం కూడా చూద్దాం. మొదటి మానవు డైన ఆదాము భార్య మాట విని దేవుని ఆజ్ఞను మీరుట వలన దేవుని శాపమే పండకపోవుటకు కారణమని తెలుస్తుంది.

**✶ దేవుడు ఆదామును చూచి - నీవు నీ భార్యమాట విని - తినవద్దని నేను నీకాజ్ఞా పించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపింపబడియున్నది... అది ముండ్ల తుప్పలను గచ్చపొదలను నీకు మొలి పించును. పొలములోని పంటతిందువు.**

చూశారా! దేవుని మాటవినక పోవుటవలన భూమి గచ్చపొదలను, ముండ్ల తుప్పలను మొలిపించిందని లేఖనం చెప్తుంది. ఆలాగునే మానవులకు పొలములోని పంటను తినమని దేవుడిచ్చిన ఆజ్ఞను కూడా మనం గ్రహించాలి. అందువల్లనే ఆనాటినుండి మానవులు పండించుకొని తింటున్నారని లేఖ నాన్ని బట్టి తెలుసుకోవాలి.

లేఖనాలను ఇలా ఒక క్రమంలో ఆలోచిస్తూ పోతుంటే ఎంతో ఆశ్చర్యం కలిగి స్తాయి. మానవుల చరిత్రను, సృష్టిలో ఏది ఎందుకుంది, ఎందుకు మనమిలా ఉంటు న్నాము మొదలగు విషయాలన్నీ తేట తెల్లమవుతాయి. భూమిని గూర్చి దేవుడు తన లేఖనాల ద్వారా మనకేమి బయల్పరచాడో ధ్యానిద్దాము.

**✶దేశనివాసుల చెడుతనమునుబట్టి ఆయన నదులను అడవిగాను నీటిబుగ్గలను ఎండిన నేలగాను సత్తువగల భూమిని చవిటిపర్రగాను మార్చెను.**

మానవులు చేసిన చెడువలన దేవుడు వారున్న దేశములను క్షామంతో బాధపర్చుచున్నాడని తెలుసుకోవాలి.నేడు లోకాన అనేక దేశాలు, వాటిలోనున్న అనేక ప్రాంతాలు ఎంతటి క్షామం అనుభవిస్తున్నామో తెలుసు. భూమి సస్యశ్యామలంగా ఉండాలంటే దేశనివాసులు దేవాజ్ఞలను ఘనపరుస్తూ ఆచరించుటొకటే మార్గమని గ్రహించాలి. దేవుని చిత్తాన్ని నెరవేర్చుటకు ఇష్టపడువారున్న దేశాలు వర్ధిల్లుతాయని లేఖనం చెప్తుంది. పశువులు కూడా వర్ధిల్లుతాయని కూడా దేవుడు సెలవిస్తున్నాడు.

**✶దేవుడు వారి పశువులను తగ్గిపోనియ్యలేదు.**

సమస్తాన్ని మనకు తెలియజేయుటకు బైబిలును మనకనుగ్రహించిన దేవునికి మనపై ఉన్న ప్రేమను ఏమని వర్ణింపగలం? వర్ణింప శక్యము కాదనిపిస్తుంది.

ప్రియులారా ఇంతవరకూ మీరు దేవుని మాటలతోపాటు వివరణను కొంత తెలుసు కొన్నారని నమ్ముతున్నాం. మరింత ఎక్కువగా భూమిని గూర్చి దైవగ్రంథాన్ని పరిశోధిస్తూ ముందుకెళ్దాం. అనంతమైన దేవునిజ్ఞానాన్ని కొంచెం కొంచెంగా తెలుసుకుంటే ఆశీ ర్వాదాలు దానంతటవే వస్తాయి. రాబోయే పత్రికల్లో మరింత వివరంగా దేవుని జ్ఞానంలో మానవవిజ్ఞానం ఎంతో తెలుసుకుందాం ప్రార్థించండి! మీరు తెలుసుకుంటున్నది మరె ందరికో తెలియజేయండి. మనయందు దేవుని చిత్తమదేనని చెప్పే లేఖన సాక్ష్యాలను గుర్తు ంచుకుంటూ నెరవేరుద్దాం. భూమిని గూర్చి మరిన్ని వివరాలు రాబోయే మీ అభిమాన క్రైస్తవనాడు "దేవుని జ్ఞానం-మానవవిజ్ఞానం" శీర్షికలో వస్తాయి. పత్రిక కొరకు ప్రార్థిస్తారు కదూ...

సేకరణ, వివరణ :
**వై.ఎల్. రవిరాజు**

# దోమల నివారణకు చర్యలు

*క్రైస్తవనాడు ప్రతినిధి, విశాఖపట్నం: మహానగర పరిధిలో దోమల నివారణకు సకల చర్యలు చేపడుతున్నట్టు నగర మేయర్ పులుసు జనార్ధనరావు చెప్పారు. అయినా ఇద్దరు డెంగ్యూ వ్యాధితో మృతి చెందారని ఆయన వెల్లడించారు. మేయర్ ఛాంబర్‌లో జరిగినన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా జూన్ నెల నుండి సెప్టెంబర్ వరకు వర్షాల కారణంగా దోమలు వృద్ధిచెంది, అంటురోగాలు ప్రబలుతున్నాయని, వీటిని అధిగమించేటందుకు నగరపాలక సంస్థ ఫాగింగ్.... స్ప్రేయింగ్‌లాంటి చర్యలు తీసుకుంటుందని ప్రజలు కూడా ఈ విషయంలో సహకరించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆయన కోరారు. నగర పరిధిలో 5 డెంగ్యూ కేసులు గుర్తించామని, వీటిలో ఒక్క గోపాలపట్నానికి చెందిన ఏడేళ్ల బాలుడు, హెచ్‌బి కాలనీ, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో ఐదేళ్ల బాలుడు మృతిచెందారని, మరో ముగ్గురికి ప్రాణాపాయం తప్పిందని మేయర్ చెప్పారు. యాంటీ లార్వా కార్యక్రమం విస్తృతంగా చేపట్టామని ప్రజలు ప్రధానంగా నీటికుండీలు, వాటర్‌ట్యాంకులపై మూతలు పెట్టాలని మురికి కాల్వలలో నీరు ప్రవహించేలా చూడాలని జనార్ధనరావు చెప్పారు. ప్రజలకు అవగాహన కలిగించడానికి రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు ఎం.ఎస్.రాజు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.*

బైబిల్ కోణంలో

# ఈనాటి సంఘాలు 1

– సైమన్ డేనీ

ఈనాటి క్రైస్తవ సంఘాలు (చర్చిలు) చాలా మారిపోయాయి. ఒక వ్యాపారరీతిలో నడిపించబడుతున్నాయి. ఎన్నో డినామినేషన్లు, కమిషన్లు, కమిటీలు, కౌన్సిళ్లు, బోర్డులు, కార్యక్రమాలు. చర్చి అనేది యేసుక్రీస్తు శరీరంలా పనిచేయడానికి బదులు వ్యాపారంలా, కుటుంబ ఆస్తిలా ఏదో ఫ్యాక్టరీలా, ఏదో కార్పొరేషన్ పనిచేయడం చూస్తున్నాము.

అంతేకాదు కేవలం లాభం కోసం పనిచేస్తున్నట్లుగా వున్నాయి కొన్ని సంఘాలు. నిస్సారమైన, బూటకపు ఉద్దేశ్యాలతో, చర్చి నిండితే చాలన్న దురాశతో పనిచేస్తూ, ఈ విధంగా ఉపయోగపడేవారికి ఏదోవిధంగా బహుమతులిచ్చి తృప్తిపరచడం, ఒకవారం చర్చిలో మనుషులు తగ్గిపోతే, ఆదాయంతో పాటు ప్రాణంకూడా పోయినట్లు బెంగపెట్టుకోవడం మొదలగునవి చూస్తుంటాము. అందుకే చాలా సంఘాల్లో రోడ్ల మీద తిరిగే మందల కోసం ఉల్లాస కార్యక్రమాలు ఏర్పాటుచేయడం, టిక్కెట్లతో భోజనాలు, అమ్మడం, అన్యులచేత పరిశుద్ధస్థలం త్రొక్కించి, పాటలు లేక డ్యాన్స్ కార్యక్రమాలు మొదలగునవి చేయించడంలాంటివి నిత్యమూ మనం చూస్తుంటాము. ఇలా చేయడం వల్ల చర్చిలో కుర్చీలు తాత్కాలికంగా నిండి ఆదాయం రావచ్చు గాని ఈ జనాభా వల్ల ఆత్మీయ, బైబిలు సంబంధమైన ఎదుగుదల ఉండదు.

ఇపుడు గాని, మరెప్పుడు గాని దేవుని చిత్తం అది కానే కాదు. మత్తయి 16:18 చెప్పినదానికి వ్యతిరేకంగా జరుగుతుంది. నా సంఘాన్ని (చర్చి) నేనే కడతానన్నాడు – యేసుక్రీస్తు. 'పాతాళలోక ద్వారములు దాని (సంఘము) ఎదుట నిలువనేరవు' అని ఆయన చెప్తే, ఈ రోజు ఈ సంఘ ద్వారములు పాతాళానికి మార్గాలుగా పనిచేస్తున్నాయి. ఇదే పరలోకపు గవిని కాకుండా నరకలోకానికి మార్గంగా తయారైనవి. యేసుక్రీస్తు కట్టిన సంఘానికి మాత్రమే ఆయన చెప్పిన మాటలు వర్తిస్తాయి. అప్పారావులు, పుల్లారావులు ఈనాటి పౌలులు, పేతుర్లు కట్టిన సంఘాలకు వర్తించవు.

ఏదైనా ఒక బిల్డింగ్ కట్టాలంటే దాని ప్లాన్ వేసేదొకరు, కట్టేదొకరు. మొన్న కడుతున్న ఐదు అంతస్తుల భవనం కూలిపోయింది. ఏదో క్లాసు నాలుగుసార్లు పల్టీకొట్టి, దొంగమార్కులతో ఇంటర్ పాసయి, లంచాలతో ఇంజనీర్ సర్టిఫికెట్ సంపాదించిన వాడు గుడిసెవేసినా ఎగిరిపోతుంది. అంతస్తుల బిల్డింగ్ అయినా కూలిపోతుంది. ఈనాటి సంఘాలు కొన్ని నామరూపాలు లేకుండా మాయమైపోతున్నాయంటే కారణం? – మీ సంఘపు ప్లాను, కట్టడం యేసుక్రీస్తు చేసిందికాదన్నమాట. కొత్తనిబంధన సంఘాలు గాని, చరిత్రలో ఇతర దేశాలలో కట్టబడిన సంఘం (సంఘాలు) ఆయన మాట ప్రకారం కట్టబడినవే గనుక వేలాది సంవత్సరాలు నిలబడే వున్నాయి. మాయమైపోయినవి వాక్యప్రకారం, ప్లాన్‌ప్రకారం కట్టబడలేదన్నమాట.

ప్రకటన 3:1 "జీవించుచున్నావన్న పేరు మాత్రమున్నది గానీ నీవు చచ్చినవాడవే" "నీ క్రియలు" = నీ సంఘంలో జరుగుతున్న అన్య కార్యక్రమములు, పరిశుద్ధాత్మ లేని వేషధారణ క్రియలు – సంపూర్ణమైనవి కాదు దేవుని ఎదుట. ఏమైపోతావు? ''నీ దీవస్థంభములు దానిచోట నుండి తీసివేతును" మారుమనస్సు, ఆత్మశక్తి లేని పాస్టరు, రక్షణనుభవం లేని సంఘపెద్దలు, వాక్యజ్ఞానం లేని సభ్యులు – యివన్నీ శవాలు. చచ్చిన శవంలా వున్న సంఘాన్ని శవాలే నడిపిస్తాయి. సంఘసభ్యులు కూడా సైతాను శక్తికి బలి అయిపోయి, చేతబడి చేయించుకున్నవాడిలా ఆ కంపుకొట్టే శవసంఘాన్నుండి తప్పించుకోలేరు.

మీటింగులు, చర్చి ఫంక్షన్లు

తదితర అవసరాలకు క్లాత్/ డిజిటల్ బ్యానర్లకై సంప్రదించండి

జెసి అమృత ఆర్ట్స్

సెల్ : 9393121588

# మూడురోజుల్లో గ్యాస్

## డీలర్లకు జె.సి. ఆదేశం

క్రైస్తవనాడు ప్రతినిధి, విశాఖపట్నం: ఎల్‌పిజి గ్యాస్ సిలండర్ బుక్ చేసుకున్న మూడు రోజుల్లోగా విడుదల చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వీరబ్రహ్మయ్య గ్యాస్‌డీలర్లను ఆదేశించారు. ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, గ్యాస్‌డీలర్లు, అధికారు లతో ఆయన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలండర్లు బుక్‌చేసుకున్న మూడు రోజుల్లోగా తప్పనిసరిగా డెలివరీ చేయాలన్నారు. డెలివరీ చేయని డీలర్లకు నోటీసులు జారీచేస్తున్నట్లు జె.సి. ప్రకటించారు. డిమాండ్లకు తగ్గట్టుగా డీలర్లు ముందుగానే గ్యాస్ కంపెనీల నుంచి లోడ్‌లను బుక్‌చేసి తెప్పించుకుని డెలివరీకి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దీపం పథకం కింద జిల్లా వ్యాప్తంగా లక్షా 58వేల గ్యాస్ కనెక్షన్‌లను మంజూరుచేశామని, వీరందరూ గ్యాస్ లేదా కిరోసిన్ ఏదో ఒక దానిని మాత్రమే పొందేందుకు అర్హులన్నారు. వీరు ఏదో ఒకదానిని మాత్రమే ఎందుకునేందుకు ప్రత్యేకించి కౌంటర్లను సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక కౌంటర్లను ప్రతి గ్యాస్ డీలర్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సిటి డిఎస్ఓ భరత్‌రెడ్డి, రూరల్ డిఎస్ఓ మురళి, పలు శాఖల అధికారులు, ఆయిల్ కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కృతజ్ఞతాపూర్వక వందనాలు

✶ మనప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగుగాక



వై.కనకరాజు (ఎడిటర్)

మీరు మమ్మాదరించిన విషయంలో కృతజ్ఞతాపూర్వక వందనాలు చెబుతున్నాం. ఎందరో మినిస్ట్రీల అధిపతులు, కాపరులు, నాయకులు మమ్మును తమ అభినందనలతో ఆశీర్వదించారు. దేవునికి స్తోత్రములు.

మీ అందరి సహకారం మేము ఎన్నటికిని మరువలేము. మాపై మీరు చూపిన ఆదరాభిమానాలు ఇలాగే ఎప్పటికిని కొనసాగాలని కోరుకుంటున్నాము. మొదటి సంవత్సరం గడిచినంతనే మాపై మరెంతో బాధ్యత పెరిగిందని బహుజాగ్రత్త పడుతున్నాం. ఆంధ్రాలో క్రీస్తును ఇంతలా ఘనపరచు పత్రిక (పేపరు) మరేదీ లేదని మీరిచ్చే అభినందన మేము ఎలా మరువగలము. బైబిలు ఔన్నత్యాన్ని, యదార్థతను లోకానికి ఎత్తిచూపేట్లున్న రచనలు 'క్రైస్తవనాడు'కే తలమానికమని మీరంటుంటే మా హృదయాలు పులకించి పోతున్నాయి. తమకు క్రైస్తవనాడు ఒక మార్గదర్శియని ఎందరో బైబిలు విద్యార్థులు కితాబిస్తుంటే... క్రీస్తును గూర్చి, బైబిలును గూర్చి వివరించుటకు మేమేపాటివారమని వినమ్రంగా సమాధానా లిస్తుంటాం. అదంతా మీరు మాపై చూపే ప్రేమని తెలియజేస్తుంటాం. అనేక అవకతవలు "చాకిరేవు" ద్వారా సరిచేస్తున్నారని ఎందరో విజ్ఞులు మాతో పలుకుతున్నప్పుడు ఆ ఆలోచనలు మావి కావు. బైబిల్లో ఎప్పుడో వ్రాయబడినవేయని గుర్తుచేస్తూ తెలియజేస్తుంటాం. వాటినే ఎత్తిచూపి ఆచరించమని చెబుతాం. ఆలాగుననే సైన్సు బైబిలుకు అతీతమైనది కాదనే సత్యాన్ని తెలియజేయుటలో మీరిచ్చే వివరణ అద్భుతం అనువారికి.... తండ్రియైన దేవుడు వాటిని బైబిల్లో కొన్ని వేల ఏళ్ల క్రితమే వ్రాయించివుంచారని చెబుతాం. దాన్నే మేము నేటి సైన్సుకు సరిపోల్చి, ఆనాటి లేఖనాల ఔన్నత్యాన్ని బయలుపరుస్తున్నామని తెలియజేస్తున్నాం. మినిస్ట్రీల వారు చేయు నిర్వాకాలెన్నో బట్టబయలు చేస్తున్నారని, ఇది అభినందించదగినదేయని ప్రశంసించువారికి మా చిరునవ్వే సమాధానం. ఎందుకంటే ప్రభువు మనకప్పగించిన బాధ్యతలను మరచువారెంతటివారైనా తగిన మూల్యం చెల్లిస్తారని మాకు తెలుసు. దానికి లేఖనాలే ఆధారం. అయితే ఆ విషయం మినిస్ట్రీల వారికి మాటల వల్ల గాని, రాతల వల్లగాని తెలియజేయాలి. అప్పుడే వారు దేవుని న్యాయవిమర్శలోకి వస్తారనే లేఖనసత్యం బాగుగా ఎరిగినవారం కాబట్టే మేము లేఖన ప్రకారం తెలలియజేస్తున్నాం. ఇందులో మా గొప్పతనమేమియు లేదని సవినయంగా చెబుతున్నాం. మనుష్యులను మభ్యపెట్టవచ్చు గాని, దేవునిని మభ్యపెట్టగలమా అని చెబుతూ జాగ్రత్తసుమండీ అని తెలియజేయుటే మినిస్ట్రీల ఆర్టికల్.

✶జీవము గల దేవుని చేతిలో పడుట భయంకరము

ప్రియులారా! ఈ సంవత్సరమంతా కూడా మీ ఆదరాభిమానాలు మా యెడల ఈలాగుననే ఉండాలని కోరుకుంటున్నాము. మీమీ ప్రార్థనలలో 'క్రైస్తవనాడు' ద్వారా జరుగు సువార్తా పరిచర్యను గుర్తుంచుకోవాలని మరొకమారు తెలియజేసుకుంటున్నాం. డిసెంబరు - జనవరి ప్రత్యేక సంచికలో మీ పరిచర్యా వివరాలు, ప్రకటనలు ఇచ్చి సహకరించాలని, ఆ ప్రత్యేక సంచిక కోసం మీ అనుదిన ప్రార్థనలలో ప్రార్థించాలని విన్నవించుకుంటున్నాం. ప్రభువు చిత్తమైతే మరొకసారి ఇలా కలుసుకుందాం - ఆమెన్

**✶ ధనమును నమ్ముకొనువాడు పాడైపోవును**





# చాకిరేవు



- ఎడిటర్

## సంఘాలలో బోధకుల - విశ్వాసుల పాత్ర 1

**✶ దేవుడు నాపక్షమున నున్నాడని నాకు తెలియును. దేవుని బట్టి నేను ఆయన వాక్యమును కీర్తించెదను.**

### బైబిలును ఎరుగుటయే

ప్రియులారా! మేము తెలియజేయు ప్రతి అంశము సత్య దూరముకాదు. కొన్నిచోట్ల కొంతమంది మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. అటువంటి వారెవరైనా నేరుగా మమ్మును సంప్రదించవచ్చు. వారి అభిప్రాయాలను మాకు తెలియజేయవచ్చు. లేక ఉత్తరాల ద్వారానైనా తెలియజేయవచ్చు. అలా మాకు వచ్చిన వాటిలోని భావాన్ని ప్రచురిస్తాం. తగిన విధంగా మా స్పందన తెలియజేస్తాం. బైబిలునందున్న లేఖనాలు ఏ ఒక్కరి సొత్తోకాదు. అవి విశ్వజనీన మైనవని మనం గుర్తెరగాలి. అపుడే మనం లేఖనాలకు పరిపూర్ణ న్యాయం చేయగలుగుతాం. గుత్తాధిపత్యం చెలాయించుటకు బైబిలు మన తండ్రుల తాతల జ్ఞానంకాదు. దేవుని దివ్యజ్ఞానం, దేవునిని మానవు లెరుగుటకును, ఎరిగి మహిమ పరచుటకును, జీవనయాత్ర భూమిపై ముగిసిన క్షణమే ఆయన చెంతకు చేరుటకు మార్గదర్శి. అందువల్ల బైబిలును చదువునపుడును, ఆచరించునపుడును బహుజాగ్రత్త కలిగియుండుట అవశ్యకం. లేఖనాలను పరిశోధించాలి. మనం తెలుసు కోవాలనుకుంటున్న అంశాన్ని గూర్చి బైబిలునందు ఎక్కడెక్కడ ఉన్నదో వెతకాలి. దానికి ఓపిక కావాలి. ఓపికలేనివారే తమకున్న మిడిమిడి జ్ఞానంవల్ల లేఖనాలను అపార్థం చేస్తుంటారని పండితుల అభిప్రాయం. వీరు ఏదో ఒక లైను చదివి అదే దేవుని ఉద్దేశమని భావించి బోధించేస్తుంటారు. ఇటువంటి వారివల్లే అనవసర వాదోపవాదాలు వస్తుంటాయని విజ్ఞుల అభిప్రాయం. అటువంటివారు వారి బోధలతో విశ్వాసులను కలవరపరుస్తుంటారు. మేము చెప్పిందే సత్యం అంటూ మిగిలిన వారిని గూర్చి చాలా తేలికగా మాట్లాడుతారు. మీరు చెప్పినదాంట్లో సత్యమెంతో పరీక్షిద్దాం. రమ్మంటే మాత్రం రారట! మా సంఘమే ఎత్తబడుతుంది. ప్రభుని రాకడలో అనే గంభీరోపన్యాసములలో వీరు ముందుంటారు. లేఖనాల ను పరిశోధించి సంపూర్ణంగా సత్యాన్ని తెలుసుకుందామంటే వీరు వెనుకంజ వేస్తారట. లేఖనాలను పరిశోదిద్దామంటే వారికెందుకు భయం? ఆలోచించండి? ఎందుకంటే లేఖనాలపై వాళ్ళకు పట్టుండదని ఇట్టే తెలిసిపోతుంది కాబట్టి. అటువంటి బోధకులున్న ఏ సంఘమైనా క్రీస్తును వాడుకొనేది తమ బ్రతుకు తెరువుకు మాత్రమే. క్రీస్తు బ్రతకడానికి వాడుకొనుటకు మాత్రమే ఉపయోగపడతారా? లేక లేకనాలయందున్న క్రీస్తు ప్రభువు తన్నెరిగినవారందరికి నిత్యజీవమిచ్చి బ్రతికించుటకు ఉపయోగ పడతారో విజ్ఞులైన విశ్వాసులు ఇప్పటికైనా ఆలోచించాలి. లేఖనాలలో ఉన్నట్లు మనం కడుపుకే దాసులం కాకూడదు. దేవునిని లేఖనాల ద్వారా అనేకులకు ప్రకటిస్తే మన బ్రతుకుకు అవుసరమైన ఈ జీవన సంబంధ విషయాలు నెరవేర్చుట ఆయనకు పెద్ద లెక్కకాదు. దేవునికి అన్నియును సాధ్యమే. మనల్ని మనకుటుంబాల్ని అనేక రకాల ఉద్యోగ, వ్యాపార, వృత్తులద్వారా పోషింప జేయుట ఆయనకు తగును. సంఘాలలో బోధకులన్నవారికే జీవన విషయంలో అభద్రత చోటుచేసుకుంటే ఇక విశ్వాసుల పరిస్థితేంటి? గలిబిలికి లోనుకారా, కాపరే అనేక విధాలుగా సంఘస్థుల యొద్దకు, లోకంలో గల క్రైస్తవ ధనవంతుల ఇండ్ల యొద్దకు తిరుగుతూ బ్రతుకుట అలవాటు చేసుకుంటే ఎలా? అని అనేకమంది విశ్వాసులు నేడు బాహాటంగానే విమర్శిస్తూ ప్రశ్నిస్తున్నారు. కొందరు విశ్వాసులైతే మా కాపరి ఆదివారం తప్ప మరేరోజు మాకు కనబడడని చెప్తుంటారు. ప్రక్కఊర్లలో ఉన్న క్రైస్తవ, క్రైస్తవేతర ధనవంతుల, రాజకీయుల ఇండ్లకే తిరుగుతుంటాడని సాక్ష్యమిస్తున్నారు. అలాంటి కాపర్లు ప్రభువన్నట్లు జీతగాళ్ళేసుమా! తోడేళ్ళు రాగానే విడిచి పారిపోయే స్వభావం గలవాళ్ళేయని మనం సుళువుగా గ్రహించవచ్చు. వీరెంతసేపూ క్రీస్తుపేరు చెప్పి ఆస్తులు కూర్చుకొనుటకే బహు ప్రయాసపడతారు. మహాభక్తులుగా తమ నటనా చాతుర్యంతో మెప్పిస్తారు. ఎవరైనా తమకున్న శ్రమలు వీరికి చెబితే ప్రార్థన చెయ్యమంటారు. ఇదేం చోద్యమోగాని వీరికే చిన్నపాటిశ్రమవచ్చినా ధనవంతుల ఇండ్ల యొద్దకు తెల్లవారగానే పరుగు తీస్తారట. దైవప్రేమగల అమాయక ధనవంతుని తమ మాటలగారడీతో బురిడీకొట్టించి తమ పబ్బం గడుపుకుంటారని బహిరంగంగానే చర్చలు జరుగుతున్నాయి. ఆలోచించండి

(మిగతా వచ్చే సంచికలో....)

**ఈ శీర్షిక అనేక ప్రాంత క్రైస్తవ, పండితుల, విశ్వాసుల అభిప్రాయాల అక్షరార్థ సమీకరణే సుమా!**

# తెలుసుకుందాం!

## సైన్స్

- ❖ బ్లడ్‌బ్యాంకులలో రక్తం నిల్వ ఉండే బ్యాగ్‌లలోని ద్రవంలో "డిస్టిల్డ్‌వాటర్, సోడియం సిట్రెట్, సిట్రిక్‌యాసిడ్, సోడియం బై ఫాస్ఫేట్, డెక్స్‌ట్రోజ్" కలుపుతారు.
- ❖ 1780లో 32 గెలాక్సీల ( నక్షత్రమండలాలు పేర్లు ప్రకటించారు చార్లెస్ మెస్సియర్ ( ఫ్రెంచ్ ఖగోళ శాస్త్రవేత్త).
- ❖ శరీరానికి గాయమైనప్పుడు రక్తం గడ్డ కట్టుకోవడంలో ప్రధానంగా తోడ్పడేవి "ప్లేట్‌లెట్‌లు, కాల్షియం అయాన్లు"
- ❖ చంద్రుడి నుంచి కాంతి కిరణం రెండుసెకండ్లు సమయంలో భూమికి చేరుతుంది.
- ❖ సూర్యుడి నుంచి కాంతి కిరణం ఎనిమిది నిమిషాలలో భూమిని చేరుతుంది.
- ❖ భూమి తన చుట్టు తాను తిరుగుటవలన రాత్రి పూట అంతరిక్షంలో నక్షత్రాలు కదిలి పోయినట్లు అన్పిస్తుంది.
- ❖ అన్ని ఆమ్లాలలోను ఉండేది" హైడ్రోజన్"
- ❖ బంగారం ఆక్వారీజియాలో కరుగుతుంది.
- ❖ ఇంతవరకు తెలిసిన లోహాలలో అతి కఠినమైనతి "టంగ్‌స్టన్"
- ❖ భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమించడానికి 365 $^{1}/_{4}$ రోజులు పడుతుంది.
- ❖ గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకారంలో తిరుగుతాయి.

## చరిత్ర...

- ❖ ఇందిరాగాంధీకి భారతరత్న పురస్కారం 1971 డిసంబర్ 18 న లభించింది.
- ❖ 2000 డిశంబర్ 23న కలకత్తా పేరును 'కోల్‌కత్తా'గా మార్చేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది.
- ❖ 1978లో భారత పార్లమెంటును కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు లోక్‌సభ ఇందిరాగాంధీని సభ నుంచి బహిష్కరించడమే గాక, జైలు శిక్ష కూడా విధించింది. డిశంబర్ 26న ఆమె జైలు నుంచి విడుదలయ్యారు.
- ❖ 1941లో హిట్లర్ తనను తాను జర్మనీ సర్వ సైన్యాధ్యక్షునిగా ప్రకటించుకున్నాడు.
- ❖ 1851లో భారతదేశంలో మొట్టమొదటి సరకు రవాణా రైలు రూర్కేలో పట్టాలకెక్కింది.
- ❖ 1979లో ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధానికి దిగిన సోవియట్ సేనలు కాబూల్‌ను ఆక్రమించుకున్నాయి.
- ❖ 1984లో హాంకాంగ్‌ను మరో పదమూడేళ్ల పాటు తమ ఆధీనంలో ఉంచుకొని, 1997లో తిరిగి అప్పజెప్పే విధంగా చైనాతో బ్రిటన్ ఒప్పందం కుదుర్చుకుంది.
- ❖ 1942లో రెండవ ప్రపంచం యుద్ధంలో జపనీస్ వాయుసేన కోల్‌కత్తాపై బాంబు దాడులు చేసింది.
- ❖ జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం

## సిల్లిన్యూస్

- ❖ ఫ్రాన్స్‌లో ఓ ఊరుపేరు ఒకే అక్షరం "వై"
- ❖ మనిషి కంటే గొంగళిపురుగు శరీరంలోని కండరాల సంఖ్య ఎక్కువ.
- ❖ పురుషుల కంటే స్త్రీలు రెట్టింపుసార్లు కనురెప్పలు మూస్తారట!
- ❖ ఫ్రిజ్‌లో పెడితే రబ్బర్‌బ్యాండ్ల మన్నిక పెరుగుతుంది.
- ❖ ముసలివాళ్ల కంటే యవ్వనంలో ఉన్నవాళ్లే ఎక్కువగా దొంగలబారిన పడతారట!
- ❖ కోకాకోలా ఫార్ములాకు పేటెంట్ లేదు. ఈ వ్యాపార రహస్యాన్ని కంపెనీలో నమ్మదగిన ఉద్యోగులకు మాత్రమే వెల్లడిస్తారట! ఈ ద్రావణానికి డూప్లికేట్లు తయారుచేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగినా ఏదీ ఫలవంతం కాలేదు.
- ❖ సగటు అమెరికన్ పౌరుడు తన జీవితకాలంలో 28 పందులను ఆరగిస్తాడట!
- ❖ మైక్రోవేవ్‌లో ద్రాక్షపళ్లు పెడితే అవి పేలిపోతాయి.
- ❖ గతంలో పోల్‌వాల్ట్‌కు ఉపయోగించే పోల్స్ వంగకుండా నిటారుగా ఉండేవి. వంగే గుణం వున్నవి ఉపయోగించడం మొదలుపెట్టాక ఎక్కువ ఎత్తుకు ఎగరగలుగుతున్నారు.
- ❖ పిల్లులు, ఒంటెలు, జిరాఫీలు మాత్రమే ముందువెనుకల వున్న కుడికాళ్లను ఒకసారి, ఎడమకాళ్లను ఒకసారి వేస్తూ నడుస్తాయి.

సేకరణ, వివరణ : **వై.ఎల్. రవిరాజు**

**✶ నీతిమంతులు చిగురాకువలె వృద్ధినొందుదురు**

# డియర్ ఎడిటర్...

**'క్రైస్తవనాడు'లో ప్రచురించబడిన ఉత్తరాల్లో లేఖనప్రకారం మమ్మును ఘనపరిచినా లేక హెచ్చరించినా సంతోషంగా స్వీకరిస్తాం. తగు విధంగా స్పందిస్తాం.**

**రెవ.ఆర్. అబ్రహామ్, నర్సీపట్నం, విశాఖపట్నం జిల్లా**

మీ క్రైస్తవనాడు పత్రిక ఆర్‌టిసి కాంప్లెక్స్ బుక్‌స్టాల్‌లో చూసి కొన్నాము. పత్రిక మాకు ఎంతో ఆదరణకరంగా అనిపించింది. మాకు పత్రిక పంపగలరు. విశ్వాసంతో ప్రభువ సేవ చేస్తున్నాను. పత్రికద్వారా మరెంతో బలపడాలని భావిస్తున్నాను. మాకోసం ప్రార్థించండి.

2. పాస్టర్ రవి చీకట్ల, గొర్స, పిఠాపురం, తూ॥గో॥జిల్లా

**Dear Beloved in Christ,**

I greet you in the almighty name of our lord jesus. i would like to read your magazine (news paper )" christavanaadu" . so, i am regeesting you to send it regularly. i will pay price letter. i am preuing for your work

Thanking you

**జవాబు: రెవ. అబ్రహామ్ మరియు పాస్టర్ రవి చీకట్ల, మీరు కనబర్చిన ప్రేమాభిమానాలకు వందనాలు. మీరు కోరినట్లుగానే మనక్రైస్తవనాడు పత్రికలను పంపుతున్నాము. మీ ఆదరాభిమానాలే ప్రభువునందు మమ్మును ఘనంగా నడుపుతాయని ఎరిగినవారం. కాబట్టి మీ అందరి ప్రార్థనలు, అభిమానాలు ప్రభువు రాకడవరకు మనం ఉంటే కొనసాగాలి. మనకుటుంబాల కొరకు ప్రభువును ప్రార్థిస్తున్నాం. మీరును పత్రిక కొరకు ప్రార్థిచండి.**

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

**జె. ప్రతాప్ కుమార్, విశాఖపట్నం.**

గౌరవనీయులైన వై. కనకరాజు గార్కి నమస్కారములు. క్రైస్తవనాడు ద్వారా మీరు అనేక విషయాలు తెలియజేస్తున్నారు. ఇంతకుముందు ఎక్కడ ఏవి జరుగుచున్నాయో తెలిసేదికాదు. పత్రిక ఎంతో ఉపయోగకరంగా ఉన్నది. ముఖ్యముగా మీకు తెలియజేయునది నేను ఉద్యోగం చేస్తున్నాను. ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి, అమ్మగారు, భార్య ఇదీ నాకుటుంబం. ఆర్థికంగా చాలా చితికిపోయాను. పరిస్థితి నుండి నన్ను తప్పించులాగున నాకొరకు ప్రార్థించమని అడుగుతున్నాను. నేను చేస్తున్న రెండు వ్యాపారాలు అభివృద్ధి కొరకును ప్రార్థించండి.

**జవాబు:- బ్రదర్ ప్రతాప్ కుమార్, మీ ఉత్తరంలో వ్రాయబడిన అవసరతల కొరకు ప్రార్థిస్తున్నాం. విశేషమేమిటంటే మీ అడ్రసు మాకు వ్రాయలేదు. మీరు కావాలనే వ్రాయలేదో లేక మరచిపోయారో మాకు తెలియదు. మీ కోరిక ప్రకారం సహాయం చేయాలని ఎవరైనా ముందుకొచ్చినా అడ్రసులేకపోవుట వలన కుదరదు. మనకు ఏదైనా అవుసరత తీరాలన్నా సంప్రదించాలన్నా అడ్రసుముఖ్యం, మీకు పేపరు పంపుటకును అవకాశం లేదు. ఈ పత్రికలో నా జవాబు మీరేవిధంగానైనా చదివితే సంప్రదించుటకు ప్రయత్నించండి. పాఠకులెవరైనా అడ్రసు వ్రాయుట మరువకండి. అది మనలను దూరం చేస్తుంది. కనీసం ఫోన్ నెంబరైనా తెలియజేయండి.**

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

**పాస్టర్ ఎస్.వి. సమర్పణరాజు & త్యాగరాజు మాస్టారు, వీరఘట్టం, శ్రీకాకుళం జిల్లా,**

క్రైస్తవనాడు ఎడిటర్ గార్కి శుభాభినందనాలు, ఉభయకుశలోపరి. మేము ఎన్నో వ్యయ ప్రయాసలు పడి చర్చిని కడుతున్నాం. కొంతపని ఉండిపోయింది. మీరు మాకొరకు ప్రార్ధన చెయ్యాలని కోరుతున్నాం. మా ప్రాంతం మీరు రావాలని కోరుతున్నాం. ఒకసారి మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని కలిసాము కూడా. మాకోసం అమూల్యమైన క్రైస్తవనాడు పత్రిక పంపగలరు.

**జవాబు:- మాస్టారూ, మీరొచ్చి మమ్మల్ని కలవడం మర్చిపోలేదు. మీకోసం ప్రార్థిస్తున్నాం. పత్రిక పంపుతున్నాం. పత్రికలు అందనివారు మరొకమారు అడ్రసు ఇవ్వగలరు. మాకోసం ప్రార్థించండి. మీ ప్రాంతం సువార్తా పరిచర్యలో నాకు అలవాటైనదే. అటువైపు వస్తే మిమ్మల్ని తప్పక కలిసేలాగున ప్రార్థించండి**

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

**ఎమ్. కృపానందరావు, చీపురుపల్లి, విజయనగరం జిల్లా**

ప్రేమగల క్రైస్తవనాడు పక్షపత్రిక వారికి వ్రాయునది, నేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా చేస్తున్నాను. క్రైస్తవనాడు పత్రిక మాకోసం పంపండి. సంవత్సరచండా పంపిస్తాను. మా కుటుంబం కొరకు ప్రార్థించండి.

**జవాబు:- మీకోసం పత్రికను పంపుతున్నాం, ప్రార్థిస్తున్నాం. మాకొరకును మీ కుటుంబ ప్రార్థనలలో గుర్తుంచుకొని ప్రార్థించాలని వేడుకుంటున్నాము. మీరిచ్చిన ఫోన్ నెంబరుకు సంప్రదించాము. చీపురుపల్లి నాకు సువార్తలో అలవాటైన ప్రాంతమే. కాబట్టి ఈసారొచ్చినపుడు కలుస్తాను.**

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

# పంచాయితీల విభజనతో మరిన్ని ఉద్యోగాలు

*క్రైస్తవనాడు ప్రతినిధి, హైదరాబాద్: పంచాయితీరాజ్ శాఖను విభజించి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖను ఏర్పాటు చేయడం ద్వారా ప్రస్తుత ఉద్యోగులకు ఎటువంటి హానివుండదని, అదనంగా మరిన్ని ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, ఆ శాఖమంత్రి జెసి దివాకరరెడ్డి అన్నారు. రాజమండ్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విభజన వలన కొందరికి పదోన్నతులు లభిస్తాయని చెప్పారు. ఈ రెండుశాఖల్లో ఏ శాఖకు వెళతారో నిర్ణయించుకునేటందుకు ఉద్యోగులకు 15 రోజుల గడువు ఇచ్చామని ఎవరికీ అన్యాయం జరగకుండా, హైపవర్ కమిటీని ఏర్పాటుచేసి, ఆ కమిటీల్లో ఉద్యోగ సంఘాల నాయకులను సభ్యులుగా చేశామని ఆయన అన్నారు. పంచాయితీ రాజ్ శాఖలో మరికొన్ని మార్పులు తీసుకువచ్చే ఆలోచన ప్రభుత్వానికి వుందని, ఆయా పదవుల్లో నిరక్షరాస్యులు ఎక్కువగా వున్నచోటే అవినీతి జరుగుతున్నట్టు ఆయన చెప్పారు. విద్య లేకపోవడంతో నియమనిబంధనలు తెలియకపోవడం దీనికి కారణమన్నారు.*

*సర్పంచ్ పదవికి ఐదవ తరగతి, జెడ్పిటీసి పదవికి 10వ తరగతి, ఛైర్మన్‌కు డిగ్రీగా అర్హతలు నిర్ణయిస్తే ప్రతిపక్షాలు, వామపక్షాలు ఘోరం జరిగినట్టు గగ్గోలు పెట్టాయని ఆయన విమర్శించారు. ఆదాయం తక్కువైన గ్రామపంచాయితీలు ఇబ్బంది పడుతున్నారని, వారికి కూర్చోడానికి కుర్చీలు, కార్యాలయ భవనాలు లేవని అందువలన చిన్న చిన్న పంచాయి తీలను కలిపి ఒకే పంచాయితీగా మార్పుచేయాలని ప్రభుత్వం భావిస్తుందని జె.సి. చెప్పారు. మైనర్ గ్రామపంచాయితీల విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఇసుక ర్యాంపులకు బహిరంగ వేలం పద్ధతి అమలుకు నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రాజమండ్రి ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్, శాసనసభ్యులు రౌతు సూర్యప్రకాశరావు, కె. చిట్టిబ్బాయ్, ఎమ్మెల్సీలు దుర్గేష్, శేషారెడ్డి, జెడ్పీ ఛైర్మన్ సి. హెచ్. వేణు తదితరులు పాల్గొన్నారు.*

**గమనిక**

**✶ గుర్తువున్న వచనాలు పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లోనివి.**

*చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!! చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!!*

**త్వరలో...**

*చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!!*

**అతి సామాన్య స్థితినుండి.... అసామాన్య స్థితికి... ఎదిగిన ఎందరో క్రైస్తవ, క్రైస్తవేతరుల "జీవనయానం" మన ఆధ్యాత్మిక, భౌతిక మేలుల కోసం.. చదవండి! చదివించండి! బలపడండి! బలపర్చండి.**

**- ఎడిటర్**

*చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!! చదవండి! చదివించండి!! బలపడండి!! బలపర్చండి!!*

# మినిస్ట్రీలు

## చేయవలసినదేమిటి? చేస్తున్నదేమిటి?

ధారావాహికం-18

- ఎడిటర్

## ✶ ఎవడైనను ప్రభువును ప్రేమిపకుంటే వాడు శపించబడును గాక!

# కులమా...? క్రైస్తవమా...?

(గత సంచిక తరువాయి...)

దైవకుమారులైన యేసుకు, తండ్రియైన దేవునికి కులాన్ని ఆపాదించుటకు మనకే అధికారం ఉంది? ఎవరి కులం వారు చెప్పుకుంటూ క్రైస్తవులుగా పరిగణింపబడువారు వారి కులాల్ని యేసుకి, దేవునికి అంగగట్టుచున్నవారే కారా? ఇది గర్హించవలసిన విషయం. క్రైస్తవులు అను పేరు ఎంతో మహిమోన్నతమైనదని బైబిలు చెప్తుంది. దాన్ని గౌరవించని వారెవరైనా క్రీస్తుకు సాక్షులు కాలేరని తెలుసుకోవాలి. శుభకార్యాలు జరుగునపుడు కుల ప్రాధాన్యతనిచ్చువారు నామకార్థ క్రైస్తవులే గాని నిజక్రైస్తవులు కాలేరు. ఇతరులు తమ కులాన్ని తమ పేరు చివరపెట్టుకుంటూ ఈ మధ్యకాలంలో బహుళ ప్రాచుర్యం తమ కులానికి తెస్తున్నారు. లోకంలో చిన్నకులమైనా, పెద్ద కులమైనా ఏదైనా సరే తమ పేరు చివర వ్రాస్తూ ప్రాచుర్యం కల్పిస్తున్నారు. మరి క్రైస్తవులమైన మన పేరు చివర క్రిస్టియన్ అని వ్రాయించుకుంటే మేలు? లేదా... కనీసం చెప్పుకుంటేనైనా మంచిది. అలా చెప్పుకొనుటకు ఇష్టపడతారో లేదో తెలియదు కానీ, క్రైస్తవులుగా మారగానే గతించినవని బైబిలునందు వ్రాయబడినవెన్నో తమ తమ జీవితాలలో గతించలేదని తమ మాటల్లో, క్రియల్లో కొందరు చెప్పకనే చెబుతారు. ప్రియులారా! ఇది చదువుతున్న మీరు పై విషయాల్లో పాలి వారైతే మాత్రం ఇప్పటినుండైనా క్రీస్తువారుగా చెప్పుకొనుటకు ఇష్టపడండి. మనందరియందు తండ్రియైన దేవుని చిత్తమదే సుమా! సంఘాలలో, ఇండ్లలో ఏ శుభాశుభ కార్యాలలోనైనా క్రైస్తవులమని చెప్పుకొనుటకు ఇష్టపడువారిగా ఉండాలి. అనేక ప్రాంతాల్లో క్రైస్తవులుగా పరిగణింపబడువారెందరో లోకస్తుల వలె అనేక ఆచార వ్యవహారాదులలో మునిగి తేలుచున్నట్లు తెలుస్తోంది. ఇలాంటివారు క్రీస్తును ఘనపరచక లోకస్తుల వలె వాస్తులు పాటిస్తూ రాళ్లతో పొదిగిన ఉంగరాలు ధరిస్తూ తమ వాహనాలకు లక్కీ నెంబర్లను వేయిస్తూ, ఇళ్లకు వేయు రంగులు సహితం అదృష్టానికి అలవాలంగా భావించువారు క్రీస్తువారా? ఎన్నటికి కాలేరు సుమా! అలాగున జీవించువారు వాటి విషయమై సమర్థింపు మాటలే ఆడతారు గానీ సరిచేసుకొనుటకు ఇష్టపడరట! వారిని ఆ నమ్మకాలే కాపాడతాయా? క్రీస్తు కాపాడలేరా? యేసుక్రీస్తు వాటి కంటే అసమర్థులా? ఆలోచించండి. పరోక్షంగా క్రీస్తును తమ క్రియల వల్ల తెలియదన్నట్లు ప్రవర్తించువారిగా వారిని గుర్తెరగాలి. ఎల్లప్పుడును ప్రభువునందే ఆనందించమని లేఖనం బోధిస్తుంది. వీరికి మాత్రం ఆనందం పైవాటిలో ఉంటుందేమోనని చూచువారికి అన్పించకమానదు. లోకాచారాలను పాటించువారెవరైనా క్రీస్తునెలా బోధించగలరు. ఆచారములనెడివి వాడుకొనుట మట్టుకు పోవుననే బైబిలు లేఖనం వీరికి అర్థమయ్యేది ఎప్పుడో ప్రభువుకే ఎరుక. ఆచార వ్యవహారాలలో సతమతమయ్యేవారి వింతచేష్టలు, మాటలు, వాటిని నిరూపించుటకై వారు పడుతున్న పాట్లు లేఖనాలను పరిపూర్ణంగా గౌరవించు క్రైస్తవులకు చోద్యంగా కన్పించకమానవు. ప్రతి విషయం లేఖనాల ప్రకారం వివరించబడతాయి. తదుపరి క్రైస్తవనాడు సంచికల విషయమై ప్రార్థించండి. మరలా చెప్పుదును ప్రభువునందు మాత్రమే ఆనందించుడి! ఆయనే అంతటా... అన్నిటా సమర్థులని గ్రహించండి.

ఇంతకూ క్రైస్తవులంటే ఎవరు? బైబిలు ఏం చెప్తోంది...?

**✶మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను 'ప్రచురము' చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు.**

దేవుని వాక్యం ఇంతగా మనలను ఘనపరుస్తుంటే కొందరికి ఎందుకో ఈ కులాభిమానం? ఇది ఎప్పటికి పోతుందో...? ప్రభువుకెరుక! అట్టి రోజులు మన తరంలోనే చూడాలని ఆశిద్దాం. అప్పుడే 'కులం' అనే కోరల నుండి విడుదల పొంది స్వతంత్రులమవుతాం. క్రైస్తవులమగుట తోడనే మనకు లభించిన తొట్టతొలి స్వాతంత్ర్యమదే! ఇది తెలియక అనేకులు క్రీస్తులో గతించినవాటిని పట్టుకొని వ్రేలాడుతున్నారు. ప్రభువు విషయంలో ఇది ఎంత మాత్రం అభినందించదగినది కాదని విజ్ఞులైన క్రైస్తవ పండితులెందరో సాక్ష్యమిస్తున్నారు. మనమంతా క్రైస్తవులముగా తద్వారా దేవుని పిల్లలుగా లోకంచే గుర్తించబడాలనే సంకల్పం కలిగివుందాం. ప్రభువు మనకు అట్టి సహాయం దయచేస్తూనేవున్నారు. ప్రార్థించిపొందుదాం.

కులాభిమానం ఉన్న క్రైస్తవులనబడిన వారిని గూర్చి కొంత వివరణ మాత్రమే లేఖనాలను బట్టి వివరించాము. చదివినవారిలో అటువంటి లక్షణాలుంటే కనీసం ఇప్పటినుండైనా మారాలని భావిస్తున్నాం. ప్రభువును మాత్రమే ఘనపర్చాలనే మాకున్న ఆశక్తిని పాఠకులు గ్రహించారనే నమ్ముతున్నాం. మరొక ఆశక్తిని రేకెత్తించే విషయాన్ని తదుపరి సంచికల్లో మీముందుకు తీసుకువస్తాము.

**గమనిక: మేము వ్రాయు వివరణలపై ఎమైనా సందేహాలుంటే మాకు ఉత్తరం వ్రాసి తగువివరణ సంపూర్ణంగా పొందండి. మీ ఉత్తరాలు, దానికి మా పత్యుత్తరం కూడా ఇదే శీర్షికలో మరెందరో ఎరుగునట్లు ప్రచురించబడతాయి. మీ అడ్రసు సంపూర్తిగా ఉండాలి. ఫోన్ నెంబరు ఉంటే తప్పక ఇవ్వాలి**

# ఇందిరమ్మ గృహాలకు కొత్త నిబంధనలు

క్రైస్తవనాడు ప్రతినిధి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ గృహాలు జిల్లాలో అధికారులకు నాయ కులకు పెద్ద తలనొప్పిగా తయారైందనే చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండలాల్లో 1/3 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా విభజించి నిర్మించే స్థోమత వున్న ప్రతీ ఒక్కరికీ గృహాలు మంజూరు చేయడం జరిగింది. అయితే వాటికి అధికారులుగా స్థానిక ఎమ్మార్వోలను నియమించడం జరిగింది. దీంతో వారు ఫీజుబులిటీ సర్టిఫికెట్లతో గృహాలు మంజూరు చేయడం విదితమే.

అయితే మొదట విడత ఆదర్శ గ్రామాల్లో కొన్ని గ్రామాల్లో నాయకుల్లో వర్గ విభేదాల వలన కొంతమంది లబ్ధిదారులకు గృహాలు నిర్మించిన తరువాత బిల్లులు చెల్లించకపోవడంతో వారు చాలా ఇబ్బందులకు గురై అప్పులపాలయ్యారనే చెప్పాలి. సంబంధిత అధికారులు ఫీజుబులిటీ ఇచ్చే ముందే లబ్ధిదారుల యొక్క అర్హతలను గుర్తించినట్టయితే సమస్య అనేది వుండకపోవచ్చుననే చెప్పాలి. కాగా మొదటివిడత ఆదర్శ గ్రామాల్లో ఇళ్ళు నిర్మించినప్పటికీ బిల్లులకు లబ్ధిదారులు నోచుకోలేదు. అయితే మరలా కొన్ని మండలాల్లో థర్డ్ పార్టీ వెరిఫికేషన్స్ అని, గృహాలు నిర్మించిన పిదప అనర్హులుగా ప్రకటించడం జరుగుతోంది. దీంతో ఇళ్ళు నిర్మించు కున్న లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇదే తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జీవోను విడుదల చేయడం జరిగింది. ఈ జీవోలో భాగంగా ఆదర్శగ్రామాల్లో గృహనిర్మాణ లబ్ధిదారుల అర్హతలపై ప్రభుత్వం తాజా మార్గదర్శకాలు విడుదల చేసింది.

- ❖ ఆదర్శ గ్రామాల్లో పూరిగుడిసెల్లో నివాసముండేవారు అర్హులు.
- ❖ తండ్రీ కొడుకులు ఒకే ఇంట్లో కాపురముంటే రెండో ఇల్లు మంజూరు చేయాలి.
- ❖ 1993-94 సంవత్సరానికి ముందు ప్రభుత్వ సహాయంతో నిర్మించిన గృహాలు శిథిలావస్థలో వుంటే అర్హులు.
- ❖ పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇంట్లో నివసిస్తున్నవారు అర్హులు.
- ❖ గతంలో గృహనిర్మాణశాఖ మంజూరు చేసిన పక్కాగృహాల్లో ఉమ్మడి కుటుంబాలు వుంటే వారిలో రెండో కుటుంబానికి ఇళ్ళు మంజూరు చేయాలి.
- ❖ లబ్ధిదారులకు తప్పనిసరిగా తెలుపు రేషన్ కార్డు వుండాలి.
- ❖ ప్రతీ లబ్ధిదారుడు ఇదివరకు వుండే గృహం ముందు నిలబడి ఫోటోలు తీయించి, దరఖాస్తుతో పాటు ఫోటోను సమర్పించాలి.
- ❖ ఈ మేరకు జీవోను జిల్లా కలెక్టర్ నుంచి మండల హౌసింగ్ అధికారులకు పంపించడం జరిగింది.

**ఎడిటర్ ఫోన్ నెంబర్ మారినది గమనించగలరు సెల్ : 9346960601**

**గమనిక: మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు.**

RNI APTEL/2006/17980



# యుపిఎఫ్ ఆధ్వర్యంలో కట్టబడుచున్న ఘనమైన

# కాకినాడ రిజర్వ్‌పోలీస్ యూనియన్ చర్చి



కాకినాడకే తలమానికం కాబోతుందా ఈ చర్చి... ?

క్రైస్తవనాడు ప్రతినిధి, కాకినాడ : బిషప్ డా॥ కె.జాన్‌పీటర్ స్థాపించిన యుపిఎఫ్ ఆధ్వర్యంలో కాకినాడలో రిజర్వ్‌పోలీస్ యూనియన్ చర్చి తయారవుతోంది. పోలీస్‌శాఖలో ఉన్నను వారు ప్రభువుపై భక్తితో ఎంతో ప్రయాసతో కట్టుటకు సంకల్పించారు. ఎన్నో ఒడుదుడుకులతో కట్టలేము




ప్రసంగిస్తున్న బిషప్ డా॥ కె.జాన్‌పీటర్

అనుకున్న సమయాన వారికి బిషప్ డా॥ కె.జాన్‌పీటర్‌ను గూర్చి తెలిసింది. ఆ విధంగా వారు యుపిఎఫ్‌లో పాలివారయ్యారు. ఆ సహవాసంతో యుపిఎఫ్ వారికి అండగా నిలిచింది. తమ ఆధ్వర్యంలో కట్టబడిన చర్చిల్లో ఈ చర్చి తలామానికం కాగలదని యుపిఎఫ్ వారు భావిస్తున్నారు. 2007 ఆగష్టు 27న బిషప్ డా॥కె.జాన్‌పీటర్ ఆధ్వర్యంలో యుపిఎఫ్ వారందరు కాకినాడకు వచ్చి జరుగుచున్న పనులను పర్యవేక్షించారు. సంతృప్తి కనబరిచి చర్చి మరింత సుందరంగా వచ్చుటకు తగిన సలహాలు ఇచ్చారు. సంఘస్థులు కూడా సంతోషించారు. చర్చి అన్నివిధాలా అనుకూలంగా ఉండుటకు తగిన కృషి చేస్తామని వినమ్రంగా చెప్పారు. అనంతరం బిషప్ డా॥కె.జాన్‌పీటర్ ప్రసంగిస్తూ ఎఫెస్సీ 5:15,16 వచనాలు వివరిస్తూ ..దినములు చెడ్డవి గనుక సేవకులెంతో జాగ్రత్తగా పరిచర్య చేయాలన్నారు. దినములను మనము మార్చలేము కాని మనుష్యుల మనసుల్ని స్వభావాల్ని మార్చుటకు ప్రయత్నించాలని హితవు పలికారు. దినాల్ని బట్టే జీవించుటకు అలవాటు పడతారేగాని మారుటకు ప్రయత్నించరని పలికారు. యోహాను 1:9లో ఉన్నట్లు మనందరం దేవుని పిల్లలంగా మారుటకు ఆశపడాలన్నారు. మారుటకు ప్రయత్నించుటకే ఎవరికైనా క్రీస్తు అవసరం అని ఉద్బోధించారు. భయంకరమైన చెడ్డదినాల్లోనే మనం మన కుటుంబాలు జీవిస్తున్నాయని మరువరాదని హెచ్చరించారు. క్రైస్తవులైనంత మాత్రాన లాభంలేదు, క్రీస్తును కలిగి వుండాలి. క్రియలు కలిగి జీవించాలి. బలమైన కార్యాలు చెయ్యాలి. చర్చిలు మనల్ని పరలోకం తీసుకెళ్ళవు. నేను చాలా చర్చిలు కట్టాను కాని అవి నన్ను పరలోకం చేరుస్తాయా, చేర్చవు. మనల్ని పరలోకం చేరుస్తాయా, చేర్చవు. మనల్ని మనం కట్టుకొనుటకు ప్రయత్నించాలి. కడవరకు నిలబెట్టుకోవాలి. పైనుండి వచ్చు జ్ఞానం కలిగి జీవించాలి. క్రీస్తే జ్ఞానమైయున్నాడని ఎల్లప్పుడు గుర్తించుకోవాలి. ప్రతిక్షణం ఆయన కనికరం కృప ప్రేమను కాపాడుకోవాలి. దేవునిని ప్రతిదినం ఎరగాలి. అలా ఎరగాలంటే వివేకం కలిగి దేవుని వెతకాలని కీర్తన 53:1,2 లేఖనం చెప్తుంది. అవివేకులముగా మనం లోకానికి కనబడకూడదు. దేవుని



కూటమిలో పాల్గొన్న విశ్వాసులు



Bishop. Dr. **K.John Peter**
Founder & President
U.P.F.
Visakhapatnam



చర్చి అంతర్భాగాన్ని మరింత మెరుగుదిద్దే ప్రయత్నంలో సమాలోచనలు

లేఖనంలో ఆస్తులు, అంతస్థులు ఉండవు. లేఖనాలు మనం ఎక్కడివారమో ఎక్కడికెళ్ళాలో తెలియజేస్తాయి. అందువల్ల నేటిదినాల్లో జాగ్రత్తకలిగి మనం జీవించాలి లోకులైతే లోకం నెమ్మదిగా ఉందని చెప్పుకోవచ్చు మనమలా అనరాదు. జాగ్రత్తకలిగి లోకంలో ఉన్నంతవరకు ప్రభువిచ్చిన రక్షణలో ఉండాలని 1 థెస్స 5:1 లేఖనం మనం నడిపిస్తుందని చెప్తూ బిషప్ డా॥కె.జాన్‌పీటర్ తన ప్రసంగం ముగించారు.

# క్రైస్తవనాయకులు, విశ్వాసులకొకమాట!

✶ మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు ఆయనయందు మమ్మును ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము.

ప్రియులారా! నేడు ప్రతివర్గానికి ఒక పత్రిక, ఒక టివి ఛానల్ కావాలనే ధోరణి స్పష్టండా కనబడుతుంది.మనకైతే టివి చానల్లు పత్రికలు ఉన్నాయి. వాటిని బలపర్చువారే కరువయ్యారు. క్రైస్తవేతరులైతే ఈ విషయంలో మనకు భిన్నంగాఉండి బలపరిచేవారిగా కనబడ్తున్నారు. వారి వారి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమ ఉనికిని లోకానికి ఘనంగా తెలియజేస్తున్నారు. మనవాళ్ళలో ఈ విషయంపై పెద్దగా ఆశక్తిలేదని నా అనుభవం చెప్తుంది. ఎందుకూ అని ఆలోచిస్తే నాయకుల లోపం స్పష్టంగా కనబడ్తుందనేది నిర్వి వాదాంశం. మినిస్ట్రీల అధిపతులు, నాయకులు ఎవరైనా కానీవండి వారికేదో క్లిష్ట పరిస్థితులు ఎదురైతేనే మీడియా గుర్తొస్తుంది. అయితే వారు చెప్పున్నదీ ఆలోచింపదగినదే. అదేదనగా నేడు అనేక పత్రికలు పుడ్తున్నాయి. ఏది ఉంటుందో ఏది ఉండదో తెలియట్లేదు. మునుపటిరోజుల్లో మాకొక పత్రికొచ్చేది. మేము ఆదరించాము. తరువాత అది రావట్లేదు. రావట్లేదని మేం చాలా బాధపడ్డాం. ఇలాంటి అభిప్రాయాలే క్రైస్తవనాయకులు, విశ్వాసులు ఎందరో మాతోకూడా చెప్పారు. వారందరికి క్రైస్తవనాడు విన్నపం ఏమంటే.... మీకొచ్చే పత్రిక రిజిస్ట్రార్ ఆఫ్‌న్యూస్‌పేపర్స్ ఇండియా (RNI) వారి అనుమతి పొందిందా? పోస్టల్‌శాఖ అనుమతితో తక్కువఖర్చుతో మీకొస్తుందా? అని ముందుగా చూడాలి. అపుడు కొంత నమ్మాలి. తరువాత పత్రికలో ప్రస్తావించబడుచున్న అంశాలేమిటి అని చూడాలి. **మన ప్రభువైన యేసుక్రీస్తుని ఘనపర్చని ఏపత్రికైనా దేవుని దృష్టిలో గుర్తింపులేనిదేనని తెలుసుకొనుట క్రైస్తవులకు ప్రాముఖ్యమైన సంగతని గుర్తెరగాలి.** పత్రికలో ప్రభువుని ఏవిధంగా ఘనపరుస్తున్నారు. బైబిలుకు పత్రిక వారు ఇచ్చే స్థానమేమిటి. పత్రిక దేశకాలమాన పరిస్థులను తెలియజేస్తుందా. మన కుటుంబానికి ఆశీర్వాదకరంగా ఉంటుందా. మనపిల్లలకు తెలివితేటలు పెపొందింపజేయు శీర్షికలున్నాయా? అన్నివిధాలా ప్రభువుకు మహిమకరంగా ఉందా. మనబ్రతుకులను ప్రభువులో తీర్చిదిద్దుతూ సరిచేయు శీర్షికలున్నాయా. పక్షపాతంలేకుండా అందర్నీ ప్రభువులో నడిపించునట్లు ఖండిస్తూ, సరిచేయు వ్రాతలు అందున్నవా. మొదలగు ప్రాముఖ్యమైన అంశాలు పత్రికలో ప్రస్తావించ బడుచున్నవా లేదా అని చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. అటువంటి ప్రత్యేకతలున్న ఏ పత్రికైనా నిలబడుతుంది. దాన్ని బలపరచవలసిన బాధ్యత మీదే. మీరు కోరు అంశమైదైనా అది భారత రాజ్యాంగానికి లోబడేదైతే క్రైస్తవనాడు ఘనంగా ప్రకటిస్తుంది. క్రైస్తవలోకం ఆధ్యాత్మికంగా ప్రభువులో ఎదుగుటకు ఒక బలమైన సాధనంగా క్రైస్తవనాడు ఉంటుందని ఒకసారి చదివితే మీకే స్పష్టంగా తెలుస్తుందనే నమ్మకం ఎడిటర్‌గా నాకుంది. మీరందరూ ఆదరంచినట్లైతే నేటి దినాల్లో క్రైస్తవనాడు క్రీస్తుని ఘనంగా ప్రకటించు పత్రిక అని వేనోళ్ళ కొనియాడబడునట్లు తీర్చిదిద్దుతాం. మరిన్ని క్రొత్త శీర్షికలతో మీ ముందుంటాం. పక్షపాతం ఏకోశానాలేని పక్షపత్రిక క్రైస్తవనాడు అని జగమెరుగునట్లు మావంతు బాధ్యతమేం సంపూర్ణంగా నిర్వర్తించుటకు ప్రయత్నిస్తాం. మాకొరకు ప్రార్థించుడి.



Bro. **Y.Kanaka Raju**



*Printed & Published and Edited, Owned by Y.Kanaka Raju, 17-108, Sanjay Gandhi Colony, Hanumanthavaka Junction, opp.L.V.Prasad Eye Institute, Visakhapatnam - 530 040, Andhra Pradesh, Ph : 9346960601, 9849134647, E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at Vinay Offset Printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam - 20*